## అబుల్ కలాం ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలి: కలెక్టర్

అబుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి

కలెక్టరేట్, నవంబర్ 11 : దేశ విద్యారంగంలో సమున్నత మార్పులు తెచ్చి, దూరదృష్టితో వ్యవహరించిన మహనీయుడు అబుల్ కలాం ఆజాద్ ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. మైనార్టీల సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అబుల్ కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య పోరాటంలో తనవంతు పాత్ర పోషించిన అబుల్ కలాం తన జీవితాన్ని దేశ ప్రజల సంక్షేమానికి దారబోశారని కొనియాడారు. మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ, దేశ తొలి విద్యామంత్రిగా అబుల్ కలాం రూపొందించిన విద్యావిధానం దేశాభివృద్ధికి ఎంతగానో తోడ్పడిందన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, మహనీయుల త్యాగాలను భావితరాలకు గుర్తుచేయాల్సిన ఆవశ్యకత ఎంతగానో ఉందన్నారు. అంతకు ముందు కలెక్టర్‌తో పాటు సమావేశంలో పాల్గొన్న పలువురు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రపుల్‌దేశాయ్, డీఆర్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి పవన్‌కుమార్, బీసీ వెల్ఫేర్ అధికారి అనిల్ ప్రకాశ్, డీవైఎస్‌వో శ్రీనివాస్, మైనార్టీ సంఘాల ప్రతినిధులు, పలువురు కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్, అధికారులపై దాడి హేయనీయం: టీఎన్జీవోస్

ఐటీఐ ఉద్యోగులకు టీఎన్జీవో సభ్యత్వం ఇస్తున్న జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

కొత్తపల్లి, నవంబర్ 11: వికారాబాద్ జిల్లా కలెక్టర్, కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేకాధికారితో పాటు ఇతర అధికారులు, ఉద్యోగులపై దాడి హేయనీయమని టీఎన్జీవోస్ కరీంనగర్ జిల్లా పక్షాన అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. దాడి చేసిన వారిపై, దానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జిల్లా కలెక్టర్లు, అధికారులకు తగిన భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నగరంలోని పాలిటెక్నిక్ ఉద్యోగులు, ఐటీఐ ఉద్యోగులు భారీగా టీఎన్జీవోలో సభ్యత్వ నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా తెలంగాణ ఎన్జీవో ఉద్యోగులందరూ విధిగా సభ్యత్వం నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్జీవోల జిల్లా కార్యదర్శి లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు గంగారపు రమేశ్, పట్టణాధ్యక్షుడు సర్దార్ హర్మేందర్ సింగ్, పాలిటెక్నిక్ ఉద్యోగుల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నజీముద్దీన్, నాయకులు రాజు, నందు, ఐటీఐ ప్రిన్సిపాల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చిగురుమామిడి, నవంబర్ 11: విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కే వెంకటేశ్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ముల్కనూరులోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులకు జడ్జి హాజరై మాట్లాడారు. వివిధ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజేశ్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, కస్తూర్బా, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ‘ప్రజావాణి’ కోసం పడిగాపులు

- రద్దైనట్లు ముందుగానే ప్రకటించినా.. పదుల సంఖ్యలో వచ్చిన ప్రజలు
- గమనించి దరఖాస్తులు స్వీకరించిన ఏవో

ప్రజావాణిలో వినతిపత్రాలు అందించేందుకు వచ్చిన పలు గ్రామాల ప్రజలు

కలెక్టరేట్, నవంబర్ 11 : కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సోమవారం ఆడిటోరియం సమీపంలో పడిగాపులు కాశారు. ఎప్పటి మాదిరిగానే ఈసారి కూడా ప్రజావాణి కార్యక్రమం ఉంటుందనే భావనతో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అనేక మంది కలెక్టరేట్ పరిసరాల్లో, దరఖాస్తులు నమోదు చేసే ప్రాంతంలో తచ్చాడుతూ కనిపించారు. అధికారులెప్పుడు వస్తారు.. ఆడిటోరియం ఇంకెప్పుడు తెరుస్తారంటూ కలెక్టరేట్‌లోని వచ్చిపోయే వారిని అడుగుతుండగా, పక్కనే ఉన్న కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్ గమనించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె సూచన మేరకు వారి నుంచి అర్జీలు తీసుకున్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కొనసాగుతున్న నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఆదివారం రాత్రి అధికారులు ప్రకటించారు. అయితే, మారుమూల గ్రామాల్లోని ప్రజలకు ఈవిషయం తెలియక సోమవారం ఉదయమే కలెక్టరేట్‌కు వచ్చారు. కాగా, ప్రజావాణి రద్దు చేస్తే ఒకరోజు ముందు ప్రకటించాల్సిందని యంత్రాంగం తీరుపై పలువురు రుసరుసలాడడం కనిపించింది.

గంగాధర మైనారిటీ పాఠశాలలో విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

## దేశానికి రోల్ మోడల్‌గా విద్యావ్యవస్థ: ఎమ్మెల్యే సత్యం

గంగాధర, నవంబర్ 11 : రాష్ట్రంలో విద్యావ్యవస్థను దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం గంగాధర మైనారిటీ గురుకుల పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సత్యం మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలను కొనియాడారు. విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వారుణి, ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజితాశ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో రాము, ఎంపీవో జనార్దన్‌రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, నాయకులు మనోహర్, రాజిరెడ్డి, శ్రీనివాస్, కనకయ్య, బాపురెడ్డి, బుచ్చయ్య, రమేశ్, సంపత్, శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

**ఇంటింటి సర్వే పకడ్బందీగా చేయాలి**

గంగాధర, నవంబర్ 11 : ప్రభుత్వం చేపట్టిన విద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ ఇంటింటి సర్వేను గ్రామాల్లో పకడ్బందీగా నిర్వహించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికారులకు సూచించారు. సోమవారం మండలంలోని మధురానగర్‌లో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను పరిశీలించారు. సర్వే తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇక్కడ ఎంపీడీవో రాము, ఎంపీవో జనార్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## కోతుల దాడిలో మహిళకు గాయాలు

హుజూరాబాద్ టౌన్, నవంబర్11: పట్టణంలోని సూపర్ బజార్ రోడ్డులో సోమవారం కోతుల దాడిలో చిరు వ్యాపారి రాణి అనే మహిళకు గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను వెంటనే ఏరియా దవాఖానకు తరలించి, చికిత్స అందించారు. కాగా, పట్టణంలో కోతుల బెడదను నివారించాలని పలువురు మున్సిపల్ అధికారులను కోరారు.

## చైతన్య సదస్సు విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, నవంబర్ 11: నగరంలోని ప్రెస్ భవనంలో ఈనెల 13న నిర్వహిస్తున్న బీసీ కులగణన చైతన్య సదస్సును విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్ పిలుపునిచ్చారు. నగరంలోని సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉదయం 11 గంటలకు ప్రారంభంకానున్న సదస్సుకు ముఖ్యఅతిథిగా సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హాజరుకానున్నారని తెలిపారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కనకయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, నాయకులు రాకేశ్‌చారి, సంజీవ్, రవీందర్ పాల్గొన్నారు.

## క్రీడల్లో గురుకుల ఖ్యాతిని చాటాలి: ఎమ్మెల్యే కవ్వంపల్లి

జ్యోతి ప్రజ్వలన చేసి స్పోర్ట్స్‌మీట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, తదితరులు

మానకొండూర్ రూరల్, నవంబర్ 11: నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించే దిశగా విద్యార్థులు తమ ప్రయత్నాలను నిరంతరం కొనసాగించాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. సోమవారం దేవంపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 10వ జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, క్రీడా జ్యోతిని వెలిగించిన అనంతరం విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లో కూడా లక్ష్యాలను నిర్దేశించుకొని గురుకుల ఖ్యాతిని చాటాలన్నారు. గురుకులాల సంయుక్త కార్యదర్శి అనంత లక్ష్మి, ప్రిన్సిపాల్ జగన్, తహసీల్దార్ రాజేశ్వరి పాల్గొన్నారు.

**ధాంక్యూ ‘ఎంఎల్‌ఏ సార్..’**

తిమ్మాపూర్, నవంబర్11: మండల కేంద్రంలోని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో సమస్యలు తీర్చిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు ఆ పాఠశాల విద్యార్థినులు ‘ఎంఎల్‌ఏ సార్’ అంగ్ల అక్షర ఆకృతిలో కూర్చొని ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అయితే సమస్యలు తీర్చితే కృతజ్ఞతలు చెప్పొచ్చని, విద్యార్థులను ఇలా గంటపాటు ఎండలో ఉంచి చెప్పాల్సిన ప్రత్యేక అవసరం ఏం ఉందని పాఠశాల ఉపాధ్యాయుల తీరుపై పలువురు విమర్శించారు.

## జీవీఆర్ పరామర్శ

మానకొండూర్, నవంబర్ 11: మండల కేంద్రానికి చెందిన నెల్లి రమేశ్ మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు సోమవారం పరామర్శించారు. రమేశ్ మృతికి కారణాలను అడిగి తెలుసుకుని మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు పిట్టల మధు, నెల్లి మురళి, ఉండింటి శ్యాంసన్, పిట్టల శ్రీనివాస్ ఉన్నారు.

## ప్రమాద బాధితుడిని పరామర్శించిన వీవీఆర్

తిరుపతిగౌడ్‌ను పరామర్శిస్తున్న వీర్ల వెంకటేశ్వర్‌రావు

గంగాధర, నవంబర్ 11 : మండలంలోని సర్వారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కర బూజ తిరుపతిగౌడ్ ప్రమాదంలో గాయపడగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు, గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలాగౌడ్ సోమవారం పరామర్శించారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇక్కడ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

కరీంనగర్ రూరల్, నవంబర్ 11: నగునూర్ గ్రామంలోని కరీంనగర్ సింగిల్ విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు సెంటర్‌ను అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోళ్లు వేగవంతం చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. అలాగే గ్రామంలో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీవో మహేశ్వర్, ఎంపీడీవో సంజీవరావు, కార్యదర్శి లచ్చయ్య, సింగిల్ విండో డైరెక్టర్ సాయిల మహేందర్, సీఈవో రమేశ్, కారోబార్ ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఒగ్గు కథా మహోత్సవం

కరీంనగర్ రూరల్, నవంబర్ 11: బొమ్మకల్ గ్రామంలోని టీవీ గార్డెన్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, జిల్లా ఒగ్గు బీర్ల వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఒగ్గు కథా మహోత్సవం 2024 కార్యక్రమాన్ని సోమవారం కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒగ్గు బీర్ల వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఒగ్గరి రాజు మాట్లాడుతూ, ఒగ్గు కళాకారులను ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారంలో భాగస్వామ్యం చేసి ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో 13 కళాబృందాలతో ఒగ్గు కథ నైపుణ్యత ప్రదర్శన నిర్వహించారు. ప్రతిభ చూపిన కళాకారులకు పారితోషికం, షీల్డ్‌లు, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఒగ్గు, బీర్ల వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మీస బీరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి కుమార స్వామి, ఉపాధ్యక్షులు సంగి లక్ష్మీపతి, ఈరు రాజమల్ల, సాయిల తిరుపతి, ముద్దారి సదానందం, కోశాధికారి పుల్ల మల్లేశం, సలహాదారులు ఈరు లింగయ్య, సాయిల మహేందర్, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంట వాసికి ఉత్తమ పురస్కారం

అవార్డు అందుకుంటున్న గాజుల అరుణ

జమ్మికుంట, నవంబర్ 11: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ ఆవిర్భావ వేడుకల్లో జమ్మికుంట పట్టణానికి చెందిన గాజుల అరుణ ‘ఉత్తమ సేవ’లకు అరుదైన పురస్కారం దక్కింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ 2024 ఉత్తమ పురస్కారం, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. కాగా, గాజుల అరుణ కొన్నేళ్లుగా తారా ఆర్ట్స్ అకాడమీ నుంచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది అత్యుత్తమ గౌరవాన్ని పొందిన అరుణకు తారా ఆర్ట్స్ అకాడమీ, తదితరులు అభినందనలు తెలిపారు.

## ఈశా గ్రామోత్సవ క్రీడాపోటీలు

మానకొండూర్, నవంబర్ 11: ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16, 17న మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ‘ఈశా గ్రామోత్సవ క్రీడా పోటీలు’ నిర్వహిస్తున్నట్లు ఆ ఫౌండేషన్ వలంటీర్లు గూడూరు మమత, నాగరాజు, సుశాంత్, శ్రవణ్, సచరిత్ సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలకు త్రోబాల్, పురుషులకు వాలీబాల్ అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ టీం సభ్యుల వివరాలు ఫోన్ నంబర్ 70958 90086, 99596 45828లో సంప్రదించి, నమోదు చేసుకోవాలని సూచించారు.

## వివేకానందలో మేనేజ్‌మెంట్ క్లబ్ ప్రారంభం

క్లబ్‌లో ఎంపికైన విద్యార్థులతో అతిథులు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 11 : జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో ఇన్యూమైండ్స్ పేరిట మేనేజ్‌మెంట్ విద్యార్థుల క్లబ్ ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అతిథిగా హాజరైన శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగా ప్రసాద్ మాట్లాడుతూ, పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు అన్ని విషయాల్లో జ్ఞానం సంపాదించుకోవాలని, అందుకు ఇలాంటి క్లబ్‌లు దోహదపడుతాయని తెలిపారు. మరో అతిథి శాతవాహన విశ్వవిద్యాలయ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఈ మనోహర్ మాట్లాడుతూ, మేనేజ్‌మెంట్ విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలు, వాక్చాతుర్యం, విషయ విశ్లేషణ వంటి నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. కళాశాల మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ కిరణ్ కుమార్, అకాడమిక్ కో ఆర్డినేటర్ సంపత్ కుమార్, కళాశాల ఏవో శ్రవణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, నవంబర్ 11: మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిభాపూలే గురుకుల మహిళా వ్యవసాయ కళాశాల (బీఎస్సీ హానర్స్)లో తాత్కాలిక ప్రాతిపదికన అగ్రికల్చర్ స్టాటిస్టిక్స్‌లో టీచింగ్ అసోసియేట్ పోస్టుకు గానూ మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ లేదా ఎంఎస్సీ అగ్రికల్చర్ అభ్యసించి ఉండాలని, అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు ఈనెల16లోగా mjpkrnagbsc2022@gmail.com కు దరఖాస్తులు పంపాలని సూచించారు.

కరీంనగర్ రూరల్, నవంబర్ 11: నగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ బోధనకు మహిళా అధ్యాపకుల (గెస్ట్) నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ టి. మాలతి ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల 18న కళాశాలలో నిర్వహించే రాత పరీక్ష, డెమో, ఇంటర్వ్యూకు ఉదయం 9గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

## శాస్త్రీయ విద్య కోసం ఉద్యమిద్దాం

కమాన్‌చౌరస్తా, నవంబర్ 11 : విద్యార్థులంతా విద్యారంగ సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, శాస్త్రీయ విద్య, సమానత్వ సమాజ స్థాపన కోసం పోరాడాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విప్లవ విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభ సోమవారం నగరంలోని పలు కళాశాలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి ఉద్యమంలో అమరులైన నాయకులకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తిరుపతి, కిషన్, రమేశ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ వంటకాల ప్రదర్శన

కమాన్‌చౌరస్తా, నవంబర్ 11: జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ ఆహార పదార్థాల ప్రదర్శన ఏర్పాటు చేయగా, కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందిస్తామని జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎస్ రమేశ్‌బాబు తెలిపారు. జంతు శాస్త్ర విభాగ ఆచార్యులు డాక్టర్ ఏ జ్యోతి లక్ష్మి, డాక్టర్ కే సురేందర్ రెడ్డి, రవీందర్ రావు, డాక్టర్ కే కిరణ్మయి, కల్పన, సమత విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశిని సేవలు మరువలేనివి

చిగురుమామిడి, నవంబర్ 11: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, దివంగత మాజీ ఎమ్మెల్యే దేశిని చిన్న మల్లయ్య నియోజకవర్గానికి, రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని వక్తలు కొనియాడారు. మండలంలోని బొమ్మనపల్లిలోని దేశిని మల్లయ్య స్వగ్రామంలో దేశిని చిన్న మల్లయ్య వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి వివిధ పార్టీ నాయకులు, గ్రామస్తులతో కలిసి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీ ప్రభుత్వ భూములు కాపాడండి

హుజూరాబాద్ టౌన్, నవంబర్11: పట్టణంలోని ఎస్సారెస్పీ భూములను కాపాడాలని యువజన కాంగ్రెస్ నేత టేకుల శ్రావణ్ సోమవారం కరీంనగర్‌లో అడిషనల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయ్‌కి వినతి పత్రం అందించారు. పట్టణంలోని సైదాపూర్ రోడ్డులో గల ఎస్సారెస్పీ ప్రభుత్వ భూమిని కొంత మంది ఆక్రమించుకొని, మున్సిపల్ కార్యాలయం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని, ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని ఆరోపించారు.

## ఉపాధ్యాయ సంఘాల డిమాండ్లు పరిష్కరించాం: డీఈవో

కమాన్‌చౌరస్తా, నవంబర్ 11: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్, టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాలు పలు డిమాండ్లపై ఈ నెల 13న కలెక్టరేట్ ఎదుట ధర్నాకు పిలుపునివ్వగా, ఈ నేపథ్యంలో జిల్లా విద్యాశాఖాధికారి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆయా సంఘాల డిమాండ్లు తాము పరిష్కరించామని అందులో పేర్కొన్నారు.

## ‘తప్పదోవ పట్టిస్తున్న డీఈవో’

కమాన్‌చౌరస్తా, నవంబర్ 11 : డీటీఎఫ్, టీపీటీఎఫ్ జిల్లా శాఖల ధర్నా నేపథ్యంలో డీఈవో విడుదల చేసిన ఖండన ప్రకటన అసత్యమని, ఉపాధ్యాయులను జిల్లా విద్యాధికారి తప్పుదోవ పట్టిస్తున్నారని ఒక ప్రకటనలో ఆయా సంఘాల బాధ్యులు ఆరోపించారు. తాము ప్రకటించిన డిమాండ్లలో జిల్లా విద్యాశాఖాధికారి ఒకటి రెండు మినహా ఏమీ పరిష్కరించలేదని పేర్కొన్నారు. ధర్నా నోటీసు ఇచ్చిన వారిని రాతపూర్వకంగా చర్చలకు పిలిచి, మాట్లాడి, మినిట్స్ నమోదు చేయాల్సి ఉండగా, ఆయన ప్రకటన విడుదల చేయడం సరికాదన్నారు. ఈ క్రమంలోనే 13న ధర్నా యథావిధిగా ఉంటుందని, జిల్లాలోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఓ ప్రకటనలో కోరారు.

## అప్రెంటిస్‌షిప్ మేళాకు స్పందన

కమాన్‌చౌరస్తా, నవంబర్ 11 : జిల్లా కేంద్రంలో ఐటీఐ కళాశాలలో ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు నిర్వహించిన ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళాకు విశేష స్పందన లభించినట్లు కరీంనగర్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ కే అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేళాలో పలు సంస్థలు పాల్గొని 154 మంది అభ్యర్థులకు ఎంపిక చేసుకున్నాయని, మిగిలిన అభ్యర్థులను దశల వారీగా ఎంపిక చేసుకునేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు.

## పాఠశాలల్లో జాతీయ విద్యా దినోత్సవం

మానకొండూర్, నవంబర్ 11: మండల కేంద్రంలోని చాణక్య ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పాఠశాల కరస్పాండెంట్ ఆడెపు రవీందర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిగురుమామిడి, నవంబర్ 11: గాగిరెడ్డి పల్లె గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కోల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు నరసింహస్వామి, రవీందర్, అనురాధ, అనిత కుమారి విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో కార్తీక సోమవారం సందడి



పాత బజార్ శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 11 : జిల్లా కేంద్రంలోని శివ, కేశవాలయాల్లో కార్తీక సోమవారం సందడి కనిపించింది. శివుడికి ప్రీతికరమైన రోజు కావడంతో పాతబజార్ నగరంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి, అభిషేక అర్చనల్లో పాల్గొన్నారు. దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు.

## అబుల్ కలాం ఆజాద్ విగ్రహావిష్కరణ

అబుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్, తదితరులు

కరీంనగర్ రూరల్, నవంబర్ 11: బొమ్మకల్ బైపాస్‌లో ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటుచేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహాన్ని ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కరీంనగర్ ఎంపీగా ఉన్న కేంద్ర సహ